క్లుప్తంగా

పదోన్నతుల కోసం మంత్రికి వినతి



మంత్రి సురేష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జగ్గారావు తదితరులు

సీటీఆర్‌ఐ: వార్డు ప్లానింగ్ కార్యదర్శుల పదోన్నతుల కోసం మున్సిపల్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌కు వినతి పత్రం అందించామని ఏపీ వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ సెక్రటరీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దడాల జగ్గారావు అన్నారు. శనివారం విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి సురేష్‌ని కలిసి తమ సమస్యలను విన్నవించామన్నారు. ప్రమోషన్ల విషయాన్ని స్పెషల్ చీఫ్ సెక్రటరీతో మాట్లాడి పరిశీలిస్తామన్నారన్నారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పిల్లి హరీష్, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు నవీన్, కార్తిక్ ఉన్నారు.

పుస్తకాల పంపిణీ

కడియం: దసరా సెలవుల్లో స్థానిక శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా ఏడు రోజుల పాటు వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు శనివారం శతక పద్య పుస్తకాలను అందజేశారు. లైబ్రేరియన్ శెట్టిపల్లి శ్రీదేవి నిర్మల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టైలరింగ్ టీచర్ గౌతమీ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది.

ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సతీష్

రాజమహేంద్రవరం సిటీ: భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కురగంటి సతీష్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా కురగంటి సతీష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఇచ్చిన పదవికి పూర్తి న్యాయం చేస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర కమిటీ నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

వక్ఫ్ బోర్డు సభ్యురాలిగా హసీనా బేగం



హసీనా బేగం

ప్రకాశం నగర్: రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యురాలిగా హసీనా బేగం నియమితులయ్యారు. ఆమె రాజమహేంద్రవరం 43వ డివిజన్ ఇన్‌చార్జిగా, పార్లమెంట్ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శిగా, బార్ అసోసియేషన్ కమిటీ సభ్యురాలిగా సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనపై ఉన్న నమ్మకంతో పదవిని ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన శిక్షణ తరగతులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసు పేట శాఖా గ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దసరా సెలవుల్లో నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమం శనివారంతో ముగిసింది. వారం రోజులు పాటు గణితంలో మెలకువలు, ఇంగ్లిష్ గ్రామర్, నీతి కథలు చెప్పడం, డ్రాయింగ్ వంటి వాటిల్లో పిల్లలకు శిక్షణ ఇచ్చినట్టు ట్రస్ట్ ఫౌండర్ సెక్రటరీ మతల రమేష్ తెలిపారు. తరగతులు నిర్వహించిన మొగల్లూరు ప్రతిభా స్కూల్ ప్రిన్సిపాల్ ఆకన రవిచంద్రను సత్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మారిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం విజేతలకు విశ్రాంత తెలుగు పండిట్ సోమశేఖరశాస్త్రి అందించిన పుస్తకాలను అందజేశారు.

9,056 మందికి వైద్యసేవలు

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా 17వ రోజు శనివారం జిల్లా వ్యాప్తంగా 16 వైద్యశిబిరాలు నిర్వహించినట్లు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక తెలిపారు. వీటిలో 9,056 మంది రోగులు వైద్య సేవలు పొందగా, 184 మందిని ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశామన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: కోలమూరు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మార్గాని సోమరాజును అరెస్టు చేశామని ఎస్ఈబీ నార్త్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. అతడి నుంచి 180 ఎంఎల్ 16 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆత్మాహత్యాయత్నం కేసు

కంబాలచెరువు: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిని అక్రమంగా అరెస్టు చేశారంటూ ఒక కార్యకర్త పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. అతడిపై మూడో పట్టణ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.ప్రకాశం జిల్లా ఉద్దుపాలెం గ్రామానికి చెందిన ఉట్టి బ్రహ్మయ్య రాజమహేంద్రవరంలోని లోకేష్ శిబిరం వద్దకు వచ్చాడు. చంద్రబాబు అరెస్టు అక్రమంటూ హడావుడి చేస్తూ వెంటతెచ్చుకున్న పెట్రోలును ఒంటిపై పోసుకున్నాడు. దీన్ని చూసిన అక్కడే ఉన్న పోలీసులు అతడిని ఆపారు.



మోరంపూడి సాయినగర్‌లో..



దేవీచౌక్‌లో మంత్రి వేణును సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



లలితా త్రిపుర సుందరిగా దేవీచౌక్ అమ్మవారు

జగన్మాతకు జేజేలు



వాసవీమాతకు అలంకరణ



సరస్వతీఘాట్‌లో నృత్యం చేస్తున్న చిన్నారులు



ఉమామార్కండేయేశ్వరస్వామి ఆలయంలో మహాలక్ష్మిగా..

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): దసరా శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా దేవీచౌక్‌లోని అమ్మవారు లలితా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ కన్యకా పరమేశ్వరిని బిస్కెట్లతో అలంకరించారు. ఉమా మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో పార్వతీమాతను మహాలక్ష్మిగా అలంకరించారు. దేవీచౌక్ సెంటర్లో కొలువైన అమ్మవారిని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచా ర పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ శనివారం దర్శించుకున్నారు. ఆయనను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రుడా మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి పాల్గొన్నారు.

అలరించిన సత్య హరిశ్చంద్ర

దేవీచౌక్‌లో అమ్మవారి పూజలతో పాటు నాటకాలు కూడా రాష్ట్ర వ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి. జానపద, పౌరాణిక నాటకాలను చూడడానికి ప్రేక్షకులు తరలి వస్తున్నారు. శనివారం రాత్రి 10 గంటలకు జయలక్ష్మి నాట్యమండలి ప్రదర్శించిన సత్యహరిశ్చంద్ర నాటకం ప్రేక్షకులను ఆలరించింది. ఒకటో హరిశ్చంద్రగా బ్రహ్మారెడ్డి, రెండో హరిశ్చంద్రగా డీవీ సుబ్బారావు, విశ్వమిత్రగా ముళ్లపూడి రామచంద్రరావు అద్భుతంగా నటించారు.

జ్ఞాన సరస్వతీ పీఠంలో..

రాజమహేంద్రవరం సిటీ: సరస్వతీ ఘాట్‌లోని జ్ఞాన సరస్వతీ పీఠంలో దసరా మహోత్సవాలలో భాగంగా అమ్మవారు శనివారం దుర్గాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారికి కుంకుమ పూజలు, హోమాలు నిర్వహించారు. ఉమా నృత్యానికేతన్ రెడ్డి ఉమారాణి శిష్య బృందం కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా సీసీసీ చానల్ ఎండీ పంతం కొండలరావు హాజరయ్యారు. పీఠం మేనేజింగ్ ట్రస్టీ తోట సుబ్బారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జయహో దుర్గాభవాని

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి సాయినగర్ విజయ కనక దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని కామాక్షీదేవిగా, బాలాజీపేట సెంటర్‌లోని ఆలయంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు.

పోలీసు అమర వీరులకు నివాళి



అమర వీరులకు నివాళులర్పిస్తున్న కమాండెంట్ ధర్మ ప్రకాష్

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక లాలాచెరువు సీఆర్‌పీఎఫ్ 42 బెటాలియన్ ఆధ్వర్యంలో కమాండెంట్ ధర్మ ప్రకాష్ శనివారం అమర వీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్ కమాండర్ జి.సురేష్ బాబు, డిప్యూటీ కమాండర్ జగదీష్ సింగ్ షెకావత్, ఏసీ సంతోష్ కుమార్, 42 బెటాలియన్ జవాన్లు పాల్గొన్నారు.

27న ఓటర్ల ముసాయిదా జాబితా



తనిఖీ కేంద్రం వద్ద కలెక్టర్ మాధవీలత, ఆర్డీవో చైత్రవర్షిణి

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): ఓటర్ల ముసాయిదా జాబితాను ఈనెల 27న విడుదల చేస్తామని కలెక్టర్ మాధవీలత తెలిపారు. ఆమె శనివారం లాలాచెరువు సమీపంలోని ఎఫ్‌సీఐ గోడౌన్స్‌లో ఎన్నికల యూనిట్లు, ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన ఓటింగ్ యంత్రాల తొలిదశ తనిఖీ ప్రక్రియ సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరుగుతోందన్నారు. ఈ నెల 16న ప్రారంభమైన ఈ ప్రక్రియ నవంబర్ 10వ తేదీ వరకూ నిర్వహిస్తామన్నారు. ఇప్పటి వరకూ 1,138 బ్యాలెట్ యూనిట్లు, 1,074 కంట్రోల్ యూనిట్లు, 1,083 వీవీ ప్యాట్ల తనిఖీలు పూర్తి చేశామన్నారు. దసరా పండగ సందర్భంగా ఈ నెల 23, 24 తేదీల్లో ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సెలవు మంజూరు చేశారని, ఆ రెండు రోజులూ ఎఫ్ఎల్‌సీ తనిఖీ ప్రక్రియ ఉండదన్నారు. ఎఫ్ఎల్‌సీ ఇన్‌స్పెక్షన్ ఇన్‌చార్జి అధికారి, ఆర్డీవో ఏ.చైత్రవర్షిణి పాల్గొన్నారు.

ఉత్సాహంగా నా భూమి - నా దేశం

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో రాజానగరం సమితి యూనిట్ పరిధిలోని నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో గుడ్ కేర్ హెల్పింగ్ సొసైటీ నేతృత్వంలో శనివారం నా భూమి – నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ దూశం కిషోర్, కడియం ఎంపీడీవో కె.రత్నకుమారి మాట్లాడుతూ దేశభక్తిని పెంపొందించేలా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రూరల్ మండల పరిపాలనాధికారి సుబ్బారావు, ఏంఈవో -1 తులసీదాస్, ఈవోపీఆర్అండ్ఆర్డీ తాడి కృష్ణ మాట్లాడారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కలశాలతో ర్యాలీ నిర్వహించారు.

జగనన్న సురక్షతో మెరుగైన వైద్యం



హుకుంపేటలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు



వెంకాయమ్మపేటలో వైద్యులను సత్కరిస్తున్న నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వైద్యశిబిరాలతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి. హుకుంపేట–1 గ్రామ సచివాలయం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన శిబిరంలో 513 మందికి వైద్యసేవలు అందించారు. 22 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫరల్ చేశారు. ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుధాకర్, సచివాలయ కన్వీనర్లతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. గైనకాలజిస్ట్ కళ్యాణి కిరణ్మయి, పీహెచ్‌సీ వైద్యులు ఏ.మేరీ లిడియా సుచిత, రోహిత, నాగదేవి రోగులకు వైద్యసేవలు అందించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పంచాయతీ సెక్రటరీ గుంటూరి వెంకట్రావు, సచివాలయ కన్వీనర్లు కురుమళ్ల ఆంజనేయులు, పసలపూడి శ్రీనివాస్, శేషాద్రి, నాయకులు చిర్రా గణేష్, రాంబాబు, పుప్పాల రాంబాబు, మస్తాన్ వలీ పాల్గొన్నారు.

నాలుగు రోజుల్లో 2,500 మందికి వైద్య పరీక్షలు

కడియం: మండలంలోని మేజర్ పంచాయతీల్లో ఒకటైన కడియపులంక గ్రామంలోని నాలుగు సచివాలయాల పరిధిలో నాలుగు రోజుల్లో 2,500 మందికి స్పెషలిస్టు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. శనివారం సచివాలయం 4 పరిధిలోని వెంకాయమ్మపేటలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 559 మందికి డాక్టర్లు ఎన్.జెస్సీ సుప్రియ, స్వరూప ఆధ్వర్యంలో జనరల్ ఓపీ, ఆప్తమాలజీ, జనరల్ మెడిసిన్, డెర్మటాలజీ, గైనిక్ విభాగాలకు చెందిన నిపుణులు పరీక్షలు నిర్వహించారు. వీరిలో అవసరమైన వారికి కళ్లజోళ్లు, మందులు అందజేశారు. డీసీహెచ్ఎస్ సనత్‌కుమారి వైద్య శిబిరాన్ని సందర్శించారు. బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, జేసీఎస్ మండల కన్వీనర్ తాడాల చక్రవర్తి పర్యవేక్షించారు.

వైద్యసిబ్బందికి సత్కారం

నాలుగు రోజుల్లో 2,500 మందికి వైద్య పరీక్షలు చేసిన వైద్య సిబ్బంది, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులను కడియపులంక పంచాయతీ తరపున ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. గ్రామంలో జగనన్న సురక్ష వైద్య శిబిరాల ముగింపులో భాగంగా వెంకాయమ్మపేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీవో కె.రత్నకుమారి, ఎంఈవో వి.లజపతిరాయ్, డాక్టర్లు జెస్సీ సుప్రియ, స్వరూప, అనూహ్య, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులను శాలువా, మెమెంటోలతో సత్కరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామంలో విస్తృత వైద్య సేవలు అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఊటుకూరి శైలజ, బోడపాటి మూర్తి, దాసరి శ్రీను, మండెల బంగారయ్య పాల్గొన్నారు.

మానసిక వికలాంగుడి దారుణ హత్య

- మెడకు టీషర్టు బిగించి ఘాతుకం
- శాటిలైట్ సిటీలో కలకలం



మహేష్ (ఫైల్)



మహేష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ కిషోర్ కుమార్, ఇన్‌స్పెక్టర్ విజయకుమార్



ఘటనా స్థలంలో డాగ్‌స్క్వాడ్ పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్: అభం శుభం తెలిసిన మానసిక వికలాంగుడిని దారుణంగా హత్య చేశారు. శాటిలైట్ సిటీలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. శాటిలైట్ సిటీలోని గాంధీబొమ్మ వీధికి చెందిన కనమరెడ్డి మహేష్ (35) మానసిక వికలాంగుడు. ప్రతిరోజూ సాయంత్రం ఇంటి నుంచి గుడికి వెళతాడు, గ్రామంలో తిరిగి రాత్రి పది గంటల సమయానికి ఇంటికి చేరుకుంటాడు. అలాగే శుక్రవారం రాత్రి భవానీల పూజకు హాజరైన మహేష్ తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఎక్కడికై నా వెళ్లాడేమో, ఉదయానికి వస్తాడనుకుని కుటుంబసభ్యులు ఊరుకున్నారు. శనివారం ఉదయానికి కూడా రాకపోవడంతో స్థానిక యువకులు వాట్సాప్ స్టేటస్‌లో అతడి ఆచూకీ కోసం పోస్టులు పెట్టారు. ఈలోగా శాటిలైట్ సిటీ పాతపేట సమీపంలోని ఖాళీ స్థలంలో గుర్తుతెలియని మృతదేహం ఉందని స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్లారు. అది కనమరెడ్డి మహేష్ మృతదేహంగా గుర్తించారు.

పోలీసుల దర్యాప్తు

విషయం తెలుసుకున్న బొమ్మూరు ఎస్సై మహమ్మద్ జుబేర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మహేష్ మెడకు టీషర్ట్ బిగించి ఉండడంతో వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. తూర్పు మండల డీఎస్పీ కిషోర్ కుమార్, బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయ కుమార్, ఎస్సై జగన్‌మోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించారు. మహేష్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ముఖంపై గుద్దడంతో పాటు అతడి టీషర్టును మెడకు బిగించి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అందరితోనూ కలివిడిగా ఉంటూ, మాటలు సరిగ్గా రాని వ్యక్తిని ఎందుకు హత్య చేశారన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గ్రామంలోని సీసీ కెమెరాలను సైతం పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్‌ను సంఘటన స్థలానికి తీసుకువచ్చి మహేష్ టీషర్టును డైనాకు వాసన చూపించగా పాతపేట అక్కమ్మతల్లి గుడి వద్దకు వెళ్లి ఆగిపోయింది. మహేష్ తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలి



12వ డివిజన్‌లో పర్యటిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం స్థానిక 12వ డివిజన్ ఇన్‌చార్జి పెద్దిరాజు ఆధ్వర్యంలో ఆ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా రేకుల షెడ్డులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పక్కా భవనంలోకి మార్చాలని సూచించారు. స్థానికుల అభ్యర్థన మేరకు డివిజన్ పరిధిలో ఉన్న పార్కులను సక్రమంగా నిర్వహిస్తూ, సెలవు దినాల్లో సైతం తెరచి ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల్లోని సమస్యలను రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఖాళీ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు పెట్టి, ఆయా ప్రాంతాల్లో చెత్తా చెదారం పెరిగిపోకుండా చూడాలన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రహరీ వెనుక వీధిలో పోలీస్ బీట్ ఏర్పాటు చేయాలని సూచించారు. జాగృతి బ్లడ్‌బ్యాంక్ జంక్షన్ నుంచి సెంటర్ డివైడర్ శీలం నూకరాజు రోడ్డులో ప్యాచ్ వర్క్ చేయాలని సూచించారు. నిరుపయోగంగా ఉన్న మున్సిపల్ ఓహెచ్ ట్యాంక్ ప్రాంతాన్ని ప్రజాపయోగ నిర్మాణానికి ఉపయోగించాలన్నారు. కోతులు బెడద తొలగించే విధంగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గాంధీ పార్కు పక్కనే డ్రైనేజీ నిర్మించాలన్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు బిళ్లపాటి శ్రీనివాస్, చింతపండు కామేష్, రాజమహేంద్రవరపు శ్రీను, ఓంకార్ ఉన్నారు.

శభాష్ శివాజీ..

- వినికిడి సమస్యను అధిగమించి విజయయాత్ర
- వరల్డ్ డెఫ్ టెన్నిస్ పోటీల్లో పతకాలు



గ్రీస్‌లో జరిగిన వరల్డ్ డెఫ్ టెన్నిస్ పోటీల్లో పతకం సాధించిన పిల్లా శివాజీ

ప్రకాశం నగర్: గ్రీస్‌లో జరిగిన వరల్డ్ డెఫ్ టెన్నిస్ చాంపియన్ షిప్ పోటీల్లో నగరానికి చెందిన పిల్లా శివాజీ ఉత్తమ ప్రతిభ కనబరిచి రెండు పతకాలు సాధించాడు. వీటీ కళాశాలలో ఇంటర్ మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 17 ఏళ్ల శివాజీ .. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడంతో తల్లిదండ్రులు రత్నం, బాల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 7 వరకూ గ్రీస్‌లో జరిగిన అంతర్జాతీయ టెన్నిస్ క్రీడా పోటీల్లో సుమారు 42 దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో బాలురు డబుల్స్ విభాగంలో రాజస్థాన్ ఆటగాడిపై పైచెయ్యి సాధించి వెండి పతకం, సింగిల్స్ విభాగంలో కాంస్య పతకాన్ని శివాజీ సాధించాడు. స్పెయిన్‌లో శిక్షణ పొందిన శివాజీ అండర్ 18 విభాగంలో జాతీయ స్థాయిలో 160వ ర్యాంక్ సాధించగా, డెఫ్ క్రీడాకారుల్లో రెండో స్థానంలో నిలిచాడు.

తండ్రి స్ఫూర్తితో..

టెన్నిస్ క్రీడాకారుడైన తండ్రి పిల్లా బాల స్ఫూర్తితో చిన్న వయసులోనే టెన్నిస్‌లో అడుగు పెట్టిన శివాజీకి ఆరో ఏట వినికిడి సమస్య ఉందని తల్లిదండ్రులు గుర్తించారు. అనాటి నుంచి చదువుతో పాటు క్రీడాల్లోను తర్ఫీదు ఇస్తే ఉన్నత స్థాయికి ఎదుగుతాడని భావించారు. ఈ క్రమంలోనే ఫుట్‌బాల్, క్రికెట్, వంటి ఆటలతో పోల్చితే వ్యక్తిగత ప్రతిభ బయటకు వచ్చే టెన్నిస్, చదరంగం, బ్యాడ్మింటన్, అర్చరీ వంటి క్రీడల్లో శిక్షణ ఇప్పించాలని నిర్ణయించుకున్నారు.

ఆర్ట్స్ కళాశాలలో శిక్షణ

ఆర్ట్స్ కళాశాల మైదానంలో అర్జున రాయుడు, బషీర్ బాబా వద్ద టెన్నిస్‌లో శివాజీ శిక్షణ పొందాడు. మొదట్లో దేశంలో ఆడుతున్న సాధారణ టెన్నిస్ క్రీడాకారులతో పోటీ పడుతూ ఎన్నో పోటీల్లో పలు పతకాలు సాధించాడు. ఈ క్రమంలోనే 2022లో పంజాబ్‌లో జరిగిన ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో అండర్ 18 విభాగంలో రెండో స్థానంలో నిలిచాడు. ఈ ఏడాది మధ్యప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లోనూ విజయం సాధించి కాంస్య పతకం గెలుచుకున్నాడు.

గర్వకారణం

అంతర్జాతీయ డెఫ్ టెన్నిస్ పోటీల్లో శివాజీ ఉత్తమ ప్రతిభ కనబరిచి రెండు పతకాలు సాధించడం అందరికీ గర్వకారణం. వినికిడి సమస్యను అధిగమించి చదువుతో పాటు టెన్నిస్‌లో కూడా అత్యుత్తమ ప్రతిభ చూపుతున్నాడు. అతడు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిద్దాం.

– శ్యామ్ సింగ్, జిల్లా టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి

మహిళా సాధికారతకు సీఎం జగన్ ప్రాధాన్యం



ముఖ్యమంత్రి ఆహా క్యాంటీన్‌ను ప్రారంభించిన డాక్టర్ గూడూరి శ్రీనివాస్

- సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్
- కోటిపల్లి బస్టాండ్‌లో ఆహా క్యాంటీన్ ప్రారంభం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, అన్ని రంగాల్లోనూ వారికి పెద్ద పీట వేస్తున్నారని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక మెప్మా ఆధ్వర్యంలో స్రవంతి గ్రూప్ నేతృత్వంలో కోటిపల్లి బస్టాండ్ వద్ద శనివారం ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి ఆహా క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలు స్వయంశక్తితో ఆర్థిక సాధికారత సాధించాలనే లక్ష్యంతో వివిధ పథకాల ద్వారా ముఖ్యమంత్రి ప్రోత్సహిస్తున్నారన్నారు. మెప్మా సంస్థ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ పరిధిలో వివిధ ఆహార ఉత్పత్తులను అందించేలా ఆహా క్యాంటీన్లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, క్లస్టర్ ఇన్‌చార్జి కొత్త విజయ రాజ్యలక్ష్మి మాట్లాడారు. పార్టీ నాయకులు కొత్త బాలమురళి, తగరం సురేష్, గణేష్, టీఎల్ఎఫ్ రేణుక, శ్యామ సుందరి, ఆర్పీలు పాల్గొన్నారు.